ఖుర్‌ఆన్, మన ప్రవక్త, వారి అనుచరులు మరియు మన మహాత్ముల విజ్ఞాన వాహకం

మాస పత్రిక

పైగామ్ ఎ హిదాయత్

(దైవసందేశం)

VOLUME 1 ISSUE 11 NOVEMBER 2013

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ సాహబ్

నాజిమ్, ఇదారా అప్రఫుల్ ఉలూమ్

చందా వివరాలు

సంచిక వెల - రూ 20/- సంవత్సర చందా - రూ 200/-

ఎకౌంట్ పేరు: MOHD ABDUL QAVI, ఎకౌంట్ నెంబర్: 035210011034204

బాంక్ మరియు బ్రాంచ్: ANDHRA BANK, MALAKPET BRANCH

నేను, ముహమ్మద్ అబ్దుల్ ఖవీ, ప్రింట్ లైన్ ప్రింటర్స్ నుండి ఈ పత్రికను ముద్రించి ఇదారా అప్రఫుల్ ఉలూమ్ ట్రస్ట్, హైదరాబాదు తరుపున ప్రవేశ పెడుతున్నాను.

Published at:17-1-391/M/13, Khaja Bagh Colony, Saidabad, Hyderabad - 59. Phone: 040-24070681 Fax: 040-24071131: 7702234385

www.idara.info E-mail: paigamehidayath@yahoo.com

విషయ సూచిక

1.	అల్లాహ్ యొక్క ప్రవచనాలు	ముఫ్తీ తకీ ఉస్మానీ సాహబ్	3
2.	పవిత్రత ...	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	7
3.	వైద్య జ్ఞానం-10		12
4.	గునాహ్ - 2	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	13
4.	విధులు - 1		15
5.	మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి జీవిత చరిత్ర	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	16
6.	జహబీ గారి కథలు		19
7.	జికిరె హబీబ్	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	20
8.	దర్సె హదీస్	మౌలానా మంజూర్ నోమానీ రెహ్	23
9.	మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వైద్య జ్ఞానం-10		24
10.	దర్సె ఖుర్ఆన్	ముఫ్తీ తకీ ఉస్మానీ సాహబ్	25
11.	ఖవాతీన్ ...	ముఫ్తీ ఎహ్మద్ అలీ కాస్మీ	29
12.	ఇస్లామీ చరిత్ర-7		33
13.	అకాయిదె ఇస్లాం (ఉర్దూలో)		34
14.	దుఆ కీ అపీల్		36

ఉత్తర ప్రత్యుత్తరాల కొరకు చిరునామా

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్, 17-1-391/2k/11, ఖాజా బాగ్ కాలనీ, సయీదాబాదు,

హైదరాబాదు - 500059. ఫోను నం. 7702234385

అల్లాహ్ యొక్క ప్రవచనాలు

ముఫ్తీ ముహమ్మద్ తకీ ఉస్మానీ సాహబ్

సూరతుల్ బురూజ్

ఈ సూరత్ మక్కీ అంటే మక్కాలో అవతరించింది.

ఈ సూరత్‌లో 22 ఆయత్‌లు మరియు ఒక రుకూ ఉన్నాయి.

బిస్ మిల్లాహిర్ రెహ్‌మాన్ నిర్రహీమ్

అల్లాహ్ పేరుతో మొదలు పెడుతున్నాను ఎవరైతే కరుణించేవాడో, అమితమైన కరుణా స్వభావం కలవాడో

1. వస్ సమా ఇ జాతిల్ బురూజ్, ఆకాశాల యొక్క బురూజ్‌లపై ఒట్టు (బురూజ్‌లు అంటే పెద్ద పెద్ద నక్షత్రాలు అని చాలా మంది పేరెన్నికగన్న పండితులు వివరించారు)

2. వల్ యౌమిల్ మౌఊద్, మరియు ఆ రోజు పై, ఏ రోజు పై ప్రమాణం చేయబడిందో (అంటే ప్రళయ దినం.)

3. వ షాహిదిమ్ మష్‌హూద్, మరియు హాజరు అయ్యే వాని పై మరియు అతని పై ఎవరి వద్ద అందరూ పోగు అవుతారో (2)

(2) ఖుర్‌ఆన్‌లో షాహిద్ అన్న పదం అంటే హాజరు అయ్యే వాడు అని మరియు మష్‌హూద్ అంటే ఎవరి వద్ద అయితే హాజరు అవుతారో అన్న పదాలు వాడబడ్డాయి. ఒకానొక ఖుర్‌ఆన్ యొక్క వివరణలలో 'షాహిద్' అంటే మానవుడని మరియు 'మష్‌హూద్' అంటే ప్రళయ దినమని అర్థం చెప్పబడినది. ఎందుకంటే ప్రళయ దినాన మానవులందరూ అల్లాహ్ తఆలా ముందు హాజరు అవుతారు. మరొక వివరణలలో 'షాహిద్' అంటే సాక్షి అని మరియు 'మష్‌హూద్' అంటే వారు, ఎవరి సాక్ష్యము అయితే ఇవ్వబడుతుందో అని చెప్పబడింది. ప్రళయ దినాన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు విశ్వాసులలోని విశ్వాసం యొక్క సాక్ష్యం ఇస్తారు.

4. కుతిల అస్‌హాబుల్ ఉఖ్‌దూద్ అల్లాహ్ యొక్క శాపం వారి పై, ఎవరైతే ఖందక్ తవ్వారో (3)

(3) పేరెన్నికగొన్న ఖుర్‌ఆన్ యొక్క వివరణలలో ఇక్కడ ఒక సంఘటనను చెప్పుకోవడం జరిగింది. ఆ సంఘటన హుజూర్ అఖ్‌దస్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిచే సహీహ్ ముస్లిమ్ యొక్క ఒక్క హదీస్‌లో వివరించబడి ఉంది. అది ఏమనగా,

పూర్వం ఒక మహారాజు ఉండేవాడు. అతడు ఒక మంత్రగానితో తన పనులు జరిపించుకునేవాడు. ఆ మంత్రగాడు ముసలి వాడు అయినప్పుడు, రాజును పిలిచి, తన వద్దకు ఒక బాలుడను పంపమని చెప్పాడు. ఆ బాలునికి మంత్ర విద్య నేర్పిస్తాను. నేను చనిపోయిన తరువాత నీకు పనికి వస్తాడు అని చెప్పాడు. అతడు చెప్పిన విధంగా ఆ మహారాజు ఒక పిల్లవాడిని ఆ మంత్రగాడి వద్దకు పంపసాగాడు.

ఆ పిల్లవాడు రోజూ మంత్రగాడి వద్దకు వెళ్ళేవాడు. దారి మధ్యలో, యేసు క్రీస్తు యొక్క అసలైన మతాన్ని (హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ గారి సరియైన, కలుషితం కాని బోధనలను) పాటించే ఒక ఋషి ఉండేవాడు. అలా పాటించేవారిని అరబీలో రాహిబ్ అని అంటారు. ఆ పిల్లవాడు మంత్రగాని వద్దకు వెళుతూ వెళుతూ ఆ రాహిబ్ వద్ద కొంచెం సేపు కూర్చుని వెళ్ళేవాడు. ఆ రాహిబ్ చెప్పే మాటలు అతడికి బాగా నచ్చసాగాయి. ఆ మాటలను వింటూ సమయం కూడా తెలియకుండా కూర్చుండి పోయేవాడు.

ఒక అతడు వెళుతూ ఉండగా దారిలో ఒక పెద్ద జంతువు అడ్డంగా కూర్చుని ఉంది. అది వచ్చే పోయే వారికి దారి పోనివ్వకుండా అడ్డుగా కూర్చుని ఉంది. (కొన్ని నివేదికలలో ఆ జంతువు ఒక పెద్ద పులి అని చెప్పబడింది). అప్పుడు ఆ పిల్లవాడు ఒక చిన్న రాయిని పైకి ఎత్తి, 'ఓ అల్లాహ్! మీకు రాహిబ్ యొక్క మాటలు ఆ మంత్రగాని మాటల కంటే ఎక్కువ ఇష్టమయితే కనుక ఈ రాయి వల్ల ఆ జంతువు యొక్క ప్రాణాన్ని తీసివేయి' అని ప్రార్థించాడు. అలా మనసులో అనుకుని ఇలా రాయి విసిరాడో లేదో ఆ రాయి తగిలి జంతువు చనిపోయింది మరియు వచ్చే పోయే వారి దారి తెరుచుకు పోయింది.

ఆ సంఘటన తరువాత ప్రజలు ఈ పిల్లవానిలో ఏదో అతీతమైన జ్ఞానము ఉందని అనుకోసాగారు. అలా ఒక అంధుడు వచ్చి తనకు కళ్ళు కనబడేలా చేయమని అడిగాడు. దానికి ఆ పిల్లవాడు ఇలా అన్నాడు, 'చేసేది నేను కాదు. నీ కళ్ళు రావాలని ఆ ప్రభువు అనుకుంటేనే అవుతుంది. అతడే ఆ పని చేస్తాడు. కళ్ళు వస్తే కనుక ఆరాధనలకు అర్హుడైన ఆ అల్లాహ్ పై విశ్వాసం ఉంచుతానని మాట ఇస్తే కనుక నేను నీ కోసం ప్రార్థిస్తాను. అతడు ఈ షరతుకు ఒప్పుకున్నాడు. ఆ తరువాత ఆ పిల్లవాడు ప్రార్థించగానే, అల్లాహ్ ప్రార్థనను మన్నించి ఆ అంధునికి కళ్ళు కనబడేలా దీవించాడు. తాను ఆశించినది జరిగినందున ఆ అంధుడు అల్లాహ్ పై విశ్వసించాడు.

ఈ సంఘటనలు మహారాజుకు తెలియగానే ఆ కళ్ళు కనపడసాగిన అంధుడిని, ఆ రాహిబ్‌ను మరియు ఈ పిల్లవాడిని బంధించారు. వీళ్ళందరినీ అల్లాహ్ పై అవిశ్వాసం తూసుకురమ్మని ఒత్తిడి తీసుకువచ్చాడు. ఆ ముగ్గురూ మాటవినకపోయేసరికి, అంధుడను మరియు ఆ రాహిబ్‌ను రపంతో కోయించివేసాడు. మరియు తన నౌకరులను పిలిచి ఆ పిల్లవాడిని పెద్ద కొండ మీద నుండి క్రిందకు తోసేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. కానీ, వాళ్ళు ఆ పిల్లవాడిని తీసుకు వెళ్ళగా, ఆ పిల్లవాడు

అల్లాహ్‌తో ప్రార్థించాడు. అప్పుడు ఆ కొండ కంపించసాగింది. అలా తీసుకు వచ్చిన వారందరూ చనిపోయారు మరియు ఆ పిల్లవాడు బ్రతికిపోయాడు.

మహారాజు, ఆ పిల్లవానిని పడవలో తీసుకు వెళ్ళి సముద్రం నడి బొడ్డులో పడేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఆ పిల్లవాడు మళ్ళీ అల్లాహ్‌ను వేడుకోగా ఆ పడవ నీటిలో బోల్తా పడి మునిగిపోయింది. మిగితా వారు చనిపోగా ఆ పిల్లవాడిని, అల్లాహ్ తన కరుణా కటాక్షాలతో బ్రతికించాడు.

మహారాజుకు ఏమి చేయాలో తోచలేదు. అప్పుడు ఆ పిల్లవాడు, 'నన్ను చంపాలనుకుంటే ఒకే ఒక్క మార్గం ఉంది. ప్రజలందరినీ ఒక మైదానానికి చేర్చి నన్ను ఉరి కంభానికి ఎక్కించి, నీ యొక్క విల్లుడుని (బాణం విసిరేవాడిని) బాణం ఎక్కుపెట్టమని చెప్పు. ఆ తరువాత, 'ఈ బాలుడి ప్రభువైన అల్లాహ్ పేరుతో' అని అను. తరువాత బాణం వదల మని చెప్పు' అని చెప్పుకొచ్చాడు. ఆ పిల్లవాడు చెప్పినట్లే చేసాడు. బాణం ఆ పిల్లవాడి నుదుటకి తగిలి వీర మరణం (షహీద్) పొందాడు.

ఇదంతా చూసిన ప్రజలలో చాలా మంది వెంటనే అల్లాహ్ పై తమ విశ్వాసాన్ని తెలుపుతూ మోమిన్‌లు అయ్యారు. ఇదంతా చూసిన ఆ రాజు, విశ్వాసం తెలిపిన వారందరినీ శిక్షించుటకై అన్ని దారుల చివరలలో పెద్ద అగాధాలను తవ్వించి వాటిని నిప్పుతో నింపాడు మరియు తన సేవకులకు విశ్వాసులందరినీ వాటిలో పడవేయవలసిందిగా ఆదేశించాడు. అలా అల్లాహ్ పై తమ విశ్వాసం తెలిపిన వారందరినీ కాల్చి వేయించాడు.

5. అన్నారి జాతిల్ ఉక్రూద్	ఆ అగ్నికి ఆహుతయ్యిన వారిపై ఇంధనం నిండి పోయి ఉంది
6. ఇజ్ హుమ్ అలైహా కుఉూద్	ఆ సమయంలో వారు దాని చుట్టూ కూర్చుని ఉన్నారు
7. వహుమ్ అలా మా యఫ్‌అలూన బిల్ ముత్‌మినీన షుహూద్	విశ్వాసులపై జరిగిన దహన కాండను చూస్తూ ఉన్నారు
8. వ మా నక్తమూ మిన్ హుమ్ ఇల్లా అన్ c యుత్‌మినూ బిల్లాహిల్ అజీజిల్ హమీద్	మరియు ఆ విశ్వాసులకు మరే విషయమై శిక్ష ఇవ్వబడలేదు, ఈ ఒక్క విషయమై వారిని శిక్షించడం జరిగింది, సర్వ శక్తిమంతుడైన మరియు స్తుతించడానికి అర్హుడైన అల్లాహ్ ను విశ్వసించడం
9. అల్లజీ లహూ ముల్కుస్ సమావాతి వల్ అర్‌జ్. వల్లాహు అలా కుల్లి షై ఇన్ షహీద్.	ఎవరి ఆధీనంలో ఈ భూమి మరియు ఆకాశాలు ఉన్నాయో మరియు అల్లాహ్ ఒక్కడే జరిగే ప్రతీ విషయానికి సాక్షి
10. ఇన్నల్లజీన ఫతనుల్ ముత్‌మినీన వల్ ముత్‌మినాతి స్తుమ్మ లమ్ యతూబూ	నమ్ము! ఎవరైతే విశ్వాసులైన పురుషులను మరియు ఆడవారిని వేధింపులకు గురి చేసారో

ఫలహుమ్ అజాబు జహన్నమ వ లహుమ్ అజాబుల్ హరీక్.	తిరిగి పశ్చాత్తాపం చెందలేదో, వారి కోసం నరకంలో శిక్ష తయారుగా ఉంది మరియు వారికి నరకాగ్నిలో కాల్చివేసే శిక్ష లభిస్తుంది.
11. ఇన్నల్లజీన ఆమనూ వ అమిలుస్ సాలిహాతి లహుమ్ జన్నాతున్c తజ్రీ మిన్c తహ్తిహల్ అన్హార్. జాలికల్ ఫౌజుల్ కబీర్.	ఎవరైతే విశ్వసించారో వారు మంచి పని చేసి ఉన్నారు. నిశ్చయంగా వారి కొరకు స్వర్గంలో ఉద్యానవనాలు, వాటి క్రింద ప్రవహించే కాలువలు ఉంటాయి. ఇదే గొప్ప విజయం.
12. ఇన్న బత్ష రొబ్బిక ల షదీద్.	నిశ్చయంగా, నీ యొక్క ప్రభువు యొక్క పట్టు చాలా గట్టిది,
13. ఇన్నహూ హువ యుబ్దిఉ వ యుఈద్.	వారే మొదటిసారి సృష్టించి ఉన్నారు మరియు వారే తిరిగి సృష్టించేవారు
14. వహువల్ గఫూరుల్ వదూద్.	మరియు వారే అమితంగా క్షమించేవారు మరియు వారే అమితంగా ప్రేమించేవారు
15. జుల్ అర్షిల్ మజీద్.	సింహాసమునకు అధిపతి మరియు మహిమాన్వితుడు
16. ఫత్ ఆలుల్ లిమా యురీద్.	అనుకున్నది చేసి తీరుతాడు.
17. హల్ అతాక హదీసుల్ జునూద్.	నీ వద్దకు ఆ సైన్యం యొక్క సమాచారం అందిందా,
18. ఫిర్ఔన వ సమూద్.	ఫిర్ఔన్ మరియు సమూద్ యొక్క (సైనిక సమాచారం)?
19. బలిల్లజీన కఫరూ ఫీ తక్జీబ్.	ఇంత జరిగినా అవిశ్వాసులు, ధిక్కరిస్తూనే ఉ--న్నారు!

(4) అంటే, అవిశ్వాసం వల్ల కలిగే అనార్థాల గురించి తెలిసి కూడా అవిశ్వాసం నుండి తప్పుకోవడంలేదు.

20. వల్లాహు మివ్c వరాఇహిమ్ ముహీత్.	అక్కడికీ, అల్లాహ్ వీరని అన్ని వైపుల నుండి ముట్టడించి ఉన్నాడు
21. బల్ హువ ఖుర్ఆనుమ్c మజీద్.	(వారు విశ్వసించని మాత్రాన ఖుర్ఆన్ మీద ఎటువంటి ప్రభావం ఉండదు) వాస్తవానికి ఇది ఒక మహత్వ్పూర్వకమైన గ్రంథం
22. ఫీ లౌహిమ్c మహ్ఫూజ్.	ఏదైతే లోహె మెహ్ఫూజ్లో(సిరక్షితమైన చోట) ఉందో

పవిత్రత

మరియు వినయంతో కూడిన సిగ్గు బిడియము

ఈ పై రెండు విషయాలకు ఇస్లాంలో ఒక ఉన్నతమైన స్థానం ఉంది.
మనందరమూ వీటికి కట్టుబడి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

అల్లాహ్ తఆలా ఇలా సెలవిచ్చారు:

"వల్లజీన హుమ్ లి ఫురూజిహిమ్ హాఫిజూన్" (సూరతుల్ ముత్‌మినూన్: 5)

అనువాదం: మరియు వారు, ఎవరైతే, తమ మర్మాంగాలను కాపాడుకుంటారో! (వారే అంతిమ విజయం సాధిస్తారు)

పవిత్రత యొక్క ఆజ్ఞ – దాని వల్ల కలిగే ఇహ మరియు పరలోకపు లాభాలు

ఖుర్‌ఆన్ మరియు హదీసుల బోధనలలో పవిత్రత మరియు వినయ విధేయలతో కూడిన సిగ్గరితనానికి చాలా ప్రాముఖ్యత ఇచ్చి ఉన్నాయి. చాలా చోట్ల వీటి గురించి చర్చించడమే కాక వాటిని అలవరచుకోవాలన్న ఆదేశాలు కూడా ఇవ్వబడ్డాయి. ఈ రెండు విషయాలను పెడ చెవిన పెట్టే వారిని ఖడించడం కూడా జరిగింది.

ముఖ్యంగా చెప్పుకోవాలంటే, **పవిత్రతే, ఇస్లాం యొక్క స్వభావం మరియు మనస్థత్వం**. అంటే ఇస్లాం మన నుండి ఆశించేది కూడా ఇదే. అంటే మన బాహ్య ప్రపంచం మరియు మనలోపల ఉండే అంతర్గత ప్రపంచాలు, మన ఆలోచనలు మరియు మనము చేసే పనులన్నీ పవిత్రతతో ఉండాలని కోరుకుంటుంది.

అల్లాహ్ తఆలా ఖుర్‌ఆన్‌లోని సూరతుల్ ఫుర్‌కాన్‌లో తన ప్రియమైన మరియు పుణ్యాత్ములైన దాసుల యొక్క లక్షణాలు మరియు స్వభావాల గురించి వివరిస్తూ ఇలా పేర్కొన్నారు:

"వల్లజీన లా యద్‌ఊన మఅల్లాహి ఇలాహన్ ఆఖర వ లా యక్‌తులూనన్ నఫ్‌సల్లతీ హర్రమల్లాహు ఇల్లా బిల్ హక్కి వ లా యజ్‌నూన్" (ఆయత్: 68)

అనువాదం: మరియు ఎవరైతే అల్లాహ్‌తో షిర్క్ చేయరో మరియు ఎవరినీ హత్య చేయరో మరియు వ్యభిచారం చేయరో (వారే అల్లాహ్ యొక్క సాన్నిహిత్యం పొందిన దాసులు. వీరు, తాము చూపిన ఓపిక మరియు దైవ భక్తి వల్ల లభించిన స్వర్గంలోని బాల్కొనీల నుండి, నలువైపుల నుండి వినిపించే అభినందల నడుమ, వీక్షిస్తూ ఉంటారు).

ఇలాగే ఖుర్‌ఆన్‌లో మరొక చోట ఇలా పేర్కొనబడి ఉంది:

"ఇన్ఁ తజ్‌తనిబూ కబాఇరొ మా తున్ హౌన అన్‌హు నుకఫ్ఫిర్ అన్ఁకుమ్ సయ్యిఆతికుమ్ వ నుద్‌ఖిల్‌కుమ్ ముద్‌ఖలన్ఁ కరీమా" (సూరతున్ నిసా: ఆయత్ 31)

అనువాదం: మీరు కనుక ఈ పెద్ద తప్పుల నుండి (మిమ్మల్ని) కాపాడుకుంటూ ఉంటే, వేటి నుండి అయితే మిమ్మల్ని ఆపడం జరిగిందో (దూరంగా ఉండండి అని చెప్పడం జరిగిందో), అప్పుడు మేము మీ యొక్క మిగతా పొరపాట్లను వాటికి బదులుగా పరిగణిస్తాము (క్షమించివేస్తాము). మరియు మీ యొక్క గౌరవ మర్యాదలకు తగిన స్థానం అంటే స్వర్గం లోనికి పంపిస్తాము.

ఖుర్ఆన్‌లోని సూరహ్ యూసుఫ్ లో హజ్రత్ సయ్యిదినా యూసుఫ్ అలైహిస్సలామ్ గారి గురించి చెప్పబడి ఉంది. హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారు యవ్వనంలో ఉన్నపుడు, ఒక అందాల పట్టమహిషి మరియు ధనవంతురాలు వీరిని తప్పు చేయమని ప్రాధేయపడింది. కానీ అల్లాహ్ యొక్క ప్రవక్త అయిన హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారు కాదని చెప్పిననూ వినక తన హొదాను ఉపయోగించి వారి ఎన్నో విధాలుగా హింసించ సాగింది. అన్ని కష్టాలలోనూ హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారు, అల్లాహ్ యొక్క కరుణా కటాక్షాల వల్ల, తమని తాము ఆ తప్పు నుండి కాపాడుకున్నారు. అల్లాహ్ యందు భక్తితో కూడుకున్న భయంతో వణికిపోయారు. మరియు మనస్సు యొక్క ప్రేరణ లేకుండానే ఈ విధంగా దుఆ చేసారు, **"రొబ్బిస్ సిజ్‌ను అహబ్బు ఇలయ్య మిమ్మా యద్‌ఊననీ ఇలైహ్"** అంటే "ఓ అల్లాహ్! ఈ ఆడవారు ఏ అపవిత్రమైన తప్పు వైపు నన్ను ఆహ్వానిస్తున్నారో, దానిని చేసేబదులు, జైలు మరియు దాని కష్టాలు నాకు ప్రియమైనవి". అలా, హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారు తన పై ఎన్నో అపనిందలు మరియు కష్టాలు భరించారు కానీ తమ పవిత్రతను మచ్చ పడకుండా కాపాడుకున్నారు. చివరకు, ఈ పరీక్షా సమయం ముగిసిన తరువాత, అల్లాహ్, వారిని గౌరవ మర్యాదలతో మిస్ర్ దేశం యొక్క సింహాసనం మరియు రాజకిరీటానికి యజమానిని చేసారు. అంటే మిస్ర్ దేశానికి మహారాజును చేసారు.

అల్లాహ్, స్వయంగా హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారి గురించి పొగుడుతూ, "కజాలిక లి నస్‌రిఫ అన్‌హుస్ సూఅ వల్ ఫహ్‌షాఅ ఇన్నహూ మిన్ ఇబాదినల్ ముఖ్‌లిసీన్" అంటే, "ఇలా మేము వారిని చెడు మరియు తప్పుడు కార్యం నుండి కాపాడాము ఎందుకంటే అతడు మా ప్రియమైన దాసుడు".

అల్లాహ్ తఆలా తన ఖుర్ఆన్‌లో సూరతుల్ అహ్‌జాబ్ ఆయత్ నెం.35 లో తనకు ఇష్టమైన మరియు ప్రియమైన దాసుల లక్షణాల గురించి వివరిస్తూ, **వల్ హాఫిజూన ఫురూజహుమ్ వల్ హాఫిజాతి...** అంటే 'తమ తమ మర్మాంగాలను (తప్పుడు కార్యాల నుండి) కాపాడుకునే మగవారు మరియు ఆడవారి కొరకు, అల్లాహ్ యొక్క క్షమాపణలు మరియు అతి పెద్ద బహుమానాన్ని బదులుగా ఇవ్వబోతున్నట్లుగా వాగ్దానం చేసారు. అల్లాహ్ వద్ద పవిత్రత ఎంత ముఖ్యమైనదో ఈ ఒక్క వాక్యంతోనే మనము అర్థం చేసుకోవచ్చు.

ఇమామ్ ఇబ్నె జహబీ రెహ్మతుల్లాహి అలైహి గారు పైన పేర్కొన్న ఆయత్‌ను వివరిస్తూ, మర్మాంగాలను కాపాడుకోవడమంటే అల్లాహ్ అనుమతించిన హలాల్ పనులు తప్ప మరే ఇతర

తప్పుడు పనుల కోసమో లేక వాంఛలను చల్లార్చడం కోసమో వీటిని ఉపయోగించడం నుండి కాపాడుకోవడం, అని చెప్పారు.

ఇలాగే, సూరతుల్ ముత్మినూన్, ఆయత్ నెం.5 **"వల్లజీన హుమ్ లి ఫురూజిహిమ్ హాఫిజూన్"** లో 'మర్మాంగాలని కాపాడుకునేవారు అంటే పవిత్రంగా ఉండేవారికి అంతిమ విజయం లభిస్తుందని చెబుతూ, వారిని స్వర్గానికి వారసులుగా మరియు ఆ స్వర్గంలో ఎన్నటికీ ఉండేవారు అన్న తీపి కబురు వినిపించారు. ఈ ఆయత్‌తో కూడా పవిత్రత యొక్క ప్రాముఖ్యత అల్లాహ్ వద్ద ఎంత ఉన్నదో మనము అర్థం చేసుకోవచ్చు.

అలాగే, సూరతన్ నూర్, ఆయత్ నెం. 30 లో ముస్లిములు (విశ్వాసులు) తమ చూపులను మరియు మర్మాంగాలని కాపాడుకోవాలని ఆజ్ఞాపించడం జరిగింది. అలా చేయడం వలన తమ తమ మనసులు పవిత్రంగా ఉంటాయని కూడా చెప్పడం జరిగింది. అక్కడకు, **మనసు మరియు ఆలోచనలు పవిత్రంగా ఉంటే మాత్రమే, అల్లాహ్ యొక్క సన్నిధికి చేరువవుతాము**.

ఈ విషయంలో మన ఆడవారిని కూడా ప్రముఖంగా ఉద్దేశించడం జరిగింది. సూరహ్ తెహ్‌రీమ్ లో హజ్రత్ మర్యమ్ అలైహిస్సలామ్ గారి సుగుణాల గురించి చెబుతూ మరియు ముస్లిమ్‌లకు వారిని నమూనాగా చూపుతూ ఇలా చెప్పడం జరిగింది. **"వ మర్యమబ్ నత ఇమ్‌రానల్లతీ అహ్‌సొనత్ ఫర్‌జహా"** అంటే "మరియు ఇమ్రాన్ యొక్క పుత్రిక, మర్యమ్, ఎవరైతే తన మర్మాంగాలను (శీలం) కాపాడుకుందో మరియు ఎన్నటికీ పవిత్రంగా ఉందో"

సూరహ్ నూర్ లో హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి సుగుణాల గురించి ఇలా "వల్ ముహ్‌సొనాతిల్ గాఫిలాతిల్ ముత్మినాతి..." అంటే "శీలవతి, అమాయకురాలు మరియు విశ్వాసురాలు" అన్న పదాలను ఉపయోగించి పొగడడం జరిగింది. మరియు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా మరియు అలాంటి స్త్రీలపై నిందలు మోపే వారిపై అల్లాహ్ యొక్క శాపం ఉంటుందని కయామత్ వరకు వచ్చే వారికి చెప్పడం జరిగింది.

ఈ అంశానికి సంబంధించి ఇప్పటి వరకు మనము కొన్ని ఖుర్‌ఆన్ యొక్క పంక్తులను చూసాము. ఇప్పుడు మన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ అంశానికి ఏమని భోదించారో ఒకసారి చూద్దాం.

ఏ మహిళైతే రోజుకు ఐదు పూట్లా నమాజులు ఆచరిస్తుందో, తన శీలాన్ని కాపాడుకుంటుందో మరియు భర్తకు విధేయురాలై ఉంటుందో – తాను స్వర్గానికి ఉన్న ద్వారాలలో ఏ ద్వారం గుండా వెళ్ళ తలచితే ఆ ద్వారం ద్వారా స్వర్గంలోనికి ప్రవేశించ వచ్చు. (ఇబ్నె హబ్బాన్: 4151/6)

బుఖారీ మరియు ముస్లిమ్ షరీఫ్‌లలో హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా సెలవిచ్చారు, "ఏడు రకాల మనుషులను, ప్రళయ దినాన(కయామత్ రోజున), అల్లాహ్ తన అర్ష్(సింహాసనం) యొక్క నీడలో చోటు కల్పిస్తారు. (ప్రళయ దినాన) అల్లాహ్ యొక్క అర్ష్ నీడ తప్ప మరెక్కడ నీడే ఉండదు.

ఆ ఏడుగురిలో ఒక యువకుడు కూడా ఉంటాడు, ఎవరైతే, ఒక అందమైన మరియు డబ్బున్న అమ్మాయి తన వైపుకు ఆకర్షించినపుడు, నేను అల్లాహ్ యొక్క భక్తి భయం కలిగి ఉన్నాను అని చెప్పి ఆ తప్పు నుండి తనను తాను కాపాడుకుంటాడో". (బుఖారీ మరియు ముస్లిమ్: 1031)

తిర్మిజీ మొదలైన పుస్తకాలలో హజ్రత్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు గారి నివేదిక ప్రకారం, తాను, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి నోటితో ఈ క్రింది సంఘటన పలు మార్లు విన్నానని చెప్పారు. "బనీ ఇస్రాయీల్‌లో కిఫ్‌ల్ అనే చెడు మరియు తప్పుడు అలవాట్లు ఉన్న ఒకడు ఉండేవాడు. ఒక రోజు అతడి వద్దకు ఒక నిస్సహాయురాలు సహాయం కోరి వచ్చింది. అతడు 60 దీనార్లు ఒక షరతు పై సహాయం చేసాడు. ఆ షరతు ఏమిటంటే ఆమె ఆతడితో వ్యభిచారం చేయాలి. ఆ నిస్సహాయురాలు చేసేది లేక ఒప్పుకుంది.

షరతును ప్రకారం ఆమె తన పని అయిపోయిన తరువాత అతడి వద్దకు వచ్చింది. అతడు కూడా తప్పు చేయడానికి సిద్ధపడి ఆమె దగ్గరకు చేరి తప్పు చేయబోగా ఆ అమ్మాయిని వణికిపోవడాన్ని గమనిస్తాడు. అప్పుడు అతడు ఆ అమ్మాయిని ఏమైందని అడుగుతాడు. దానికి ఆ అమ్మాయి, 'నేను ఇలాంటి తప్పు ఇంతకు ముందెన్నడూ చేయలేదు. నా నిస్సహాయత వల్ల ఇవాళ ఈ తప్పు చేయవలసి వస్తోంది' అని చెప్పింది.

ఆ అమ్మాయిలో ఉన్న సిగ్గు, బిడియం మరియు అల్లాహ్ యొందు భయాన్ని చూసి అతడు, 'ఒక అమ్మాయి అయి ఉండి నీవు అల్లాహ్ యందు భయభ్రాంతులు కలిగి ఉంటే, మగాడినైన నేను ఎంతలా భయపడాలి? ఇంకా ఎక్కువగా భయపడాల్సిన అవసరం ఉంది. నేను నీకు ఇచ్చిన డబ్బుని తీసుకుని వెళ్ళిపో మరియు ఇక్కడి నుండి వెంటనే వెళ్ళిపో. ఈ రోజు నుండి నేను అల్లాహ్ యొక్క మాటను ఎన్నటికీ జవఁదాటను' అని అన్నాడు.

అలా అన్నాడో లేదో, అల్లాహ్ యొక్క తలరాత(తక్‌దీర్ వల్ల) వల్ల అతడికి మరణం సంభవించింది. మరునాటి ఉదయం ఆ బస్తీ వారు అతడి ద్వారం పై "ఇన్నల్లాహ కద్ గఫరల్ కిఫ్‌ల్" అంటే "అల్లాహ్, కిఫ్‌ల్ ను క్షమించివేసాడు" అని రాసి ఉండడాన్ని ప్రత్యక్షంగా చూసారు.

సుబ్‌హానల్లాహ్! మనము ఊహించను కూడా లేము. అల్లాహ్, తన దాసులపై ఎటువంటి కరుణా కటాక్షాలు కురిపిస్తాడో.

బుఖారీ మరియు ముస్లిమ్‌లలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్హు యొక్క నివేదిక ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా సెలవిచ్చారు, 'ఒకసారి ముగ్గురు తమ ప్రయాణం మధ్యలో బడిలక తీర్చుకోవడానికి ఒక గుహలో ఆగారు. ఉన్నట్టుండి ఒక పెద్ద బండ రాయి క్రింద పడింది. దీని వల్ల ఆ గుహ యొక్క ద్వారం మూసుకుపోయింది. మరియు బయటకు రావడానికి ఆ ద్వారం తప్ప మరే దారి లేకపోయింది. ఆ ముగ్గురు, ఈ సంఘటనతో చాలా విచారించారు.

ఏమి చేయాలని ఆలోచిస్తూ ఉంటే ఒక మంచి ఆలోచన తట్టింది. ఈ ఆలోచనతో ఆ ముగ్గురూ ఏకీభవించారు. ఆ ఆలోచన ఏమిటంటే, 'జీవితంలో చేసిన అత్యంత మంచి పనులను అల్లాహ్ ముందు పెట్టి, ఈ ఆపద నుండి కాపాడమని ప్రార్థించడం'.

అలా వారు తమ జీవితాలలోకి తొంగి చూడడం మొదలు పెట్టారు మరియు ప్రతీ మంచి పనిని గుర్తుకు తెచ్చుకోసాగారు. అలా గుర్తుకు వచ్చిన వాటి నుండి గొప్పది అనుకున్న వాటిని అల్లాహ్ యొక్క సన్నిధానంలో ఉంచి దుఆ చేయడం మొదలు పెట్టారు. మరియు ఒక్కరూ దూఆ చేయగా, ప్రతి ఒక్కరి దుఆనకు బదులుగా ఆ బండ రాయి కొద్ది కొద్దిగా ప్రక్కకు జరగడం జరిగింది. చివరకు బయటకు వచ్చేసేంత సందు ఏర్పడగా, ముగ్గురూ బయటకు వచ్చేసారు.

ఈ ముగ్గురి ప్రార్థనలలో ఒకరి దుఆ ఏమిటంటే, 'ఓ అల్లాహ్! నాకు ఒక చెల్లెలు (బాబాయి కూతురు) ఉండేది. ఆమె అంటె నాకు చాలా ఇష్టం. నేను ఆమెను తప్పు చేద్దామని పిలుస్తూ ఉండేవాడిని. కానీ ఆమె నిరాకరించేది. అలా ఒకసారి ఆమె మరియు తన యొక్క ఇంట్లోని వారు కరువు కాటకాల వల్ల ఇబ్బందులు పడుతూ ఉంటే, సహాయం చేయమని నా దగ్గరకు వచ్చింది. నేను అదే అదునుగా చూసి ఆమెకు 120 దీనారులు, నాకు ఒకసారి తనతో తప్పు చేసే అవకాశం ఇవ్వాలి అన్న షరతు పై ఇచ్చాను. చేసేది లేక ఆమె దానికి ఒప్పుకుంది మరియు ఆ అవకాశం ఇచ్చింది. అలా నేను ఆమెతో దగ్గరయ్యి తప్పు చేయబోగా, 'నా శీలాన్ని ఇలా హరామ్ చేసి (నిషేధించబడిన తీరుగా) పాడుచేయడం ఎంత వరకు సబబు' అని అంది. ఓ అల్లాహ్! ఇది విన్న వెంటనే అంతటి నాజూకు సమయంలోనూ, నేను ఆమెకు దూరంగా జరిగిపోయాను. నేను ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి తీసుకోలేదు. ఆ అమ్మాయి అంటే నాకు ఎన లేని ప్రేమ ఉండేది. ఓ అల్లాహ్! ఈ పని, ఆ సమయంలో, నేను నీ పై ఉన్న భక్తి మరియు భయంతోనే చేసి ఉంటే, ఈ ఆపద నుండి (బండ రాయి ద్వారం మూసివేడం నుండి) మమ్మల్ని కాపాడండి. ఈ దుఆ తరువాత, అల్లాహ్, తన కరుణా కటాక్షాలతో ఆ బండ రాయిని ప్రక్కకు జరిపి వేసాడు.

వాస్తవానికి ఇది మనము చదివినంత సులువు కాదు. ఒక సారి ఆలోచించి చూడండి. ఒక యువకుడు ఒక అమ్మాయి పై పడి చస్తూ ఉంటాడు. మరియు చాలా కాలంగా ఆ అమ్మాయిని తన వలలో పడేయడానికి చూస్తూ ఉంటాడు. మరియు ఆ అమ్మాయి నిరాకరిస్తూ ఉంటుంది. కాలం కలసి రాక ఆ అమ్మాయే సహాయం కోసం ఆ యువకుని తలుపు తట్టి వస్తుంది. మరియు ఇబ్బందుల వల్ల సహాయం కోసం ఏమి చేయడానికైనా తయారు అయ్యింది. ఆ సమయంలో, ఆ ఇద్దరి మధ్య ఉన్న పరదాలు అన్నీ మాయమైపోయాయి. ఒక యువకుడు తనలో ఇన్నాళ్ళు ఆపి ఉంచుకున్న జోష్‌తో ఆ అమ్మాయి పై సవారు అవ్వడానికి సిద్ధమైన క్షణాన అల్లాహ్, మరియు ఇస్లాం యొక్క అనుమతి మరియు నిషేదాజ్ఞలు ముందుకు రాగానే వదిలి దూరంగా వెళ్ళడమనేది రాయడా--నికి, చదవడానికి బాగానే ఉంటాయి. కానీ మనసున్న ఎవరైనా సలభంగా అర్థం చేసుకుంటారు, ఇది ఎంత కష్టమైన పనో మరియు ఎంత పెద్ద త్యాగమో! దీనికి దృఢమైన విశ్వాసం కావాలి. అందుకే

అల్లాహ్ వద్ద, ఈ పని యొక్క సార్ధకత్వం ఈ లోకంలోనే తెలిసి పోయింది.**"ఇలైహి యస్‌అదుల్ కలిముత్ తొయ్యిబు వల్ అమలుస్ సాలిహు యర్‌ఫఉహూ"** అని అందుకే చెప్పబడి ఉంది. ఎవరైతే అల్లాహ్ యొక్క భక్తి భయాలతో తమ జీవితాలను గడపాలనుకుంటున్నారో మరియు ఎవరైతే ఇలాంటి ఇబ్బందులలో పడినప్పుడు దాని నుండి బయట పడాలని అనుకుంటున్నారో వారి కొరకు ఈ సంఘటనలో తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయి. హజ్రత్ సొహైల్ బిన్ సయీద్ రజియల్లాహు తాలా అన్హు గారు చెప్పారని ఇమామె బుఖారీ గారు ఇలా నివేదించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా సెలవిచ్చారు, 'ఎవరైనా తన రెండు దవడల మధ్య ఉన్న భాగం (నాలుక) మరియు రెండు తొడల మధ్య ఉన్న భాగం (మర్మాంగం)ల గురించి హామీ ఇస్తారో, నేను వారికి స్వర్గం (లభిస్తుందని) హామీ ఇస్తాను. (బుఖారీ: 6474)

ఇమామ్ బైహకీ రెహ్మ గారు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ రజియల్లాహు తఅలా అన్హు నివేదించారని ఇలా ఉటంకించారు. నబీ ఎ కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా సెలవిచ్చారు, 'ఓ ఖురైష్ వంశానికి చెందిన యువకుల్లారా! తమ తమ మర్మాంగాలను కాపాడుకోండి. వ్యభిచారం చేయకండి. వినండి! ఎవరైతే తన మర్మాంగంను కాపాడుకున్నాడో, అతడి కోసం స్వర్గం అన్న మంచి కబురు ఉంది. (సునెన బైహకీ: 4/5369)

పైన వివరించబడిన ఆయాత్‌లు మరియు అహాదీస్‌లు, సంఘటనలతో మనకు అర్థమవుతుంది, ఇస్లాం మనను పవిత్రత మరియు బిడియంతో ఉండాలన్న విషయమై ఎంతగా నొక్కి ఒక్కాణించి చెప్పిందో. అంతే కాక, పవిత్రత మరియు మానమర్యాదలతో ఉండడం వల్ల మనము అల్లాహ్ మరియు వారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గార్ల సాన్నిహిత్యానికి చాలా దగ్గరవుతాము. చివరగా చెప్పుకోవలసింది ఏమనగా తమ తమ మానాన్ని మరియు పవిత్రతను కాపాడుకునే దాసులను, అల్లాహ్, ఇహ పరలోకాలలో సుఖసంతోషాలతో ఉంచుతాడు మరియు వారి పై తన కరుణా కటాక్షాలను ప్రసాదిస్తాడు.

ఓ అల్లాహ్! మా అందిరికీ పై మీ యొక్క కరుణా కటాక్షాలు ప్రసాదించండి. (అల్లాహుమ్మ ఆమీన్)

అన్ని అనారోగ్యాలకు ఒకటే వైద్యం

హజ్రత్ ఉస్మాన్ గనీ రజియల్లాహు అన్హు గారు ఇలా నివేదించారు, 'ఒక సారి నేను అనారోగ్యం పాలైతే, నన్ను పరామర్శించడానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వచ్చారు మరియు ఈ దుఆ చదివి, నా పై దమ్ చేసారు (అంటే దుఆ చదివి నా పై ఊదారు) మరియు వెళ్తూ ఇలా అన్నారు: ఓ ఉస్మాన్! ఈ దుఆనే చదువి దమ్ చేసుకుంటూ ఉండు.

"బిస్మిల్లాహ్ హిర్ రెహ్‌మాన్ నిర్ రహీమ్, ఉఇజుక బిల్లాహిల్ అహదిస్ సొమదిల్ లజీ లమ్ యలిద్ వలమ్ యూలద్ వలమ్ యకుల్లహూ కుఫువన్ అహద్ మిన్ షర్రి మా యజిద్"

గునాహ్-2

ఇస్లాం నిషేధించిన పెద్ద పెద్ద తప్పులు

ఇమామ్ షమ్సుద్దీన్ ముహమ్మద్ అజ్ జహబీ (రెహ్)

హత్య చేయడం

ఖుర్ఆన్ మజీద్‌లో ఇలా పేర్కొనబడి ఉంది:

వ మన్ఁ యక్‌తుల్ ముత్‌మినన్ ముతఅమ్మిదన్ఁ ఫ జజాఉహూ జహన్నము ఖాలిదన్ఁ ఫీహా వ గొజిబల్లాహు అలైహి వ లఅనహూ వ అద్దలహూ అజాబన్ అజీమా. (సూరతున్ నిసా: 93)

అనువాదం: మరియు ఎవరైనా తెలిసి తెలిసి (నా హక్) హత్య చేస్తే, దానికి బదులుగా నరకం (పొందుతారు). వాళ్ళు దీనిలో ఎల్లప్పటికీ ఉంటారు మరియు వారి పై అల్లాహ్ యొక్క కోపముంటుంది మరియు వారి పై అల్లాహ్ యొక్క శాపం ఉంటుంది మరియు అల్లాహ్, వారి కోసం చాలా పెద్ద శిక్షను తయారు చేసి ఉన్నారు.

అలాగే ఖుర్ఆన్‌లోనే మరో చోట ఇలా పేర్కొని ఉన్నారు:

వ ఇజల్ మౌఊదతు సుఇలత్. బి అయ్యి జంబిఁ కుతిలత్. (సూరతుల్ తక్‌వీర్: 8,9)

అనువాదం: ప్రాణం ఉండగానే పాతి పెట్టేయబడిన వారిని అడగడం జరుగుతుంది, "నిన్ను ఏ తప్పు వల్ల హత్య చేయడం జరగింది?" (అని).

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడి ఉంది.

ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని ఇలా అడిగాడు, 'ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! అల్లాహ్ వద్ద అన్నిటికంటే పెద్ద తప్పు మరియు నేరం ఏది?'.

దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, 'నీ యొక్క ప్రభువైన అల్లాహ్‌కు సరిసమానంగా మరెవరినైనా నిలబెట్టడం (అన్నిటికంటే పెద్ద తప్పు) అసలుకైతే అల్లాహ్‌యే నిన్ను సృష్టించి ఉన్నారు'.

దానికి ఆ వ్యక్తి, 'దీని తరువాత (పెద్ద తప్పు) ఏది?' అని అడిగాడు.

'నీ యొక్క కడుపున పుట్టిన పిల్లలను, జీవనాధారానికి భయపడి, చంపేయడం', అని జవాబిచ్చారు.

దానికి ఆ వ్యక్తి, 'దీని తరువాత పెద్ద తప్పు ఏది?' అని అడిగాడు.

'నీ యొక్క పొరుగు వారి భార్యతో వ్యభిచారం చేయడం', అని సెలవిచ్చారు.

ఈ పై హదీసు నివేదించిన వారి ఇలా కూడా చెప్పారు, 'ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఈ సంభాషణనతో ఏకీభవిస్తూ, ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ అవతరించింది':

వల్లజీన లా యద్‌ఊన మఅల్లాహి ఇలాహన్ ఆఖర వ లా యక్‌తులూనన్ నఫ్‌సల్లతీ హర్రమల్లాహు ఇల్లా బిల్ హక్కి వ లా యజ్‌నూన్. (అల్ ఫుర్‌కాన్: 68)

అనువాదం: మరియు (రెహ్మాన్ అంటే కరుణామయుడైన అల్లాహ్ యొక్క సన్నిహితులు ఎవరంటే) ఎవరైతే అల్లాహ్‌నకు సమానంగా వేరెవరిని ఆరాధించరో మరియు ఎవరినీ ఒట్టిగా హత్య చేయరో మరియు వ్యభిచారం చేయరో.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఇలా సెలవిచ్చారు:

"ఇద్దరు ముస్లిమ్‌లు ఒకరి పై ఒకరు కత్తులు దూసుకుంటారో, అప్పుడు హంతకుడు మరియు హత్యకు గురి అయినవాడు ఇద్దరూ నరకానికి వెళతారు.

అప్పుడు సహాబా రజియల్లాహు అన్‌హుమ్ (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి అనుచరులు) ఇలా అన్నారు, 'ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! హంతకుడు నరకానికి వెళ్తాడంటే అర్థం చేసుకోవచ్చుగానీ, హత్యకు గురైనవాడు నరకానికి ఎందుకు వెళ్తాడు?'.

దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, 'ఎందుకంటే అతడు కూడా తన తోటి వాడిని చంపాలకున్నాడు కనుక' అని జవాబిచ్చారు. (అవతలి వాడు గట్టి పోటీ ఇవ్వడంతో ఇతడు హత్యకు గురయ్యాడు. అలాకాకపోతే ఇతడే అవతలి వాడిని చంపేవాడు కదా)

అబూ సులైమాన్ రెహ్మతుల్లాహి అలైహ్ గారు ఇలా వివరించారు: ఇద్దరూ ఏదైనా ఇహలోకపు వాంఛల కొరకో లేక ఉన్నత స్థానం కొరకో లేక అధికార కుర్చీ కోసమో లేక మరేదైనా శత్రుత్వం వలనో కనుకనైతేనే ఇద్దరికీ నరక శిక్ష లభిస్తుంది.

అదే తనను తాను రక్షించుకోవడం కోసమో లేక తన సంపదను రక్షించుకోవడం కోసమో లేక తన భార్యా పిల్లలను రక్షించుకోవడం కోసమో పోరాడుతూ కీచకుల చేతిలో చనిపోతే కనుక అతడికి పైన చెప్పిన శిక్ష లభించదు.

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొని ఉన్నది:

'కయామత్ రోజున మొదటగా (చిందించిన) రక్తం లెక్క తేల్చవలసి ఉంటుంది. అంటే, హత్యల గురించి మరియు వాటితో ముడి పడి ఉన్న వారి లెక్కలు తేలుస్తారు.

మరొక హదీసులో ఇలా పేర్కొనబడి ఉంది:

అల్లాహ్ వద్ద, ఒక విశ్వాసిని (మోమిన్‌ను) హత్య చేయడం అంటే ఈ మొత్తం లోకాన్ని నాశనం చేస్తే ఎంత చెడ్డ విషయమో, అంత చెడ్డ విషయం అన్న మాట.

మరొక చోట ఇలా పేర్కొని ఉంది:

ఒక విశ్వాసి తన మతం యొక్క సరిహద్దులలో అప్పటి వరకు ఉంటాడు ఎప్పటి వరకైతే హత్య చేయడో.

(అంటే హత్య చేయడం వల్ల అతడు మతానికి చెందిన సరిహద్దుల నుండి బయటకు పంపివేయ బడతాడు).

మరొక సంధర్భంగా ఇలా పేర్కొనబడి ఉన్నది:

ఎవరైనా ఒక ముఆహిద్‌ను (అంటే ఒక అవిశ్వాసి ఎవరైతే విశ్వాసులతో శాంతి ఒప్పందం కుదుర్చుకుని ఉన్నాడో అతడిని) హత్య చేసినట్లైతే కనుక, అతడు కనీసం స్వర్గం యొక్క సువాసన కూడా చూడలేడు. (ఇక్కడ ఒక విషయం తెలుసుకోవలసిందేమిటంటే, స్వర్గం యొక్క సువాసన నలభై సంవత్సారాలు ప్రయాణిస్తే చేరుకునే దూరం వరకు కూడా పరిమళిస్తుంటుంది).

చివరకు చెప్పుకోవలసినది ఏమనగా, ఎవరైతే ఒక విశ్వాసి యొక్క హత్యకు సగం మాట సాయం చేసిననూ, ప్రళయ దినాన అతడి నుదిటి పై "ఆఈసు మిన్ రెహ్మతిల్లాహ్" అంటే 'అల్లాహ్ యొక్క కరుణకు దూరమైపోయిన వాడు' అని రాసి ఉంటుంది.

హజ్రత్ మఆవియ రజియల్లాహు తఆలా అన్హు గారి నివేదిక ప్రకారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా ప్రభోదించారు, 'అల్లాహ్ తఆలా రెండు తప్పులను వదిలి మిగిలిన అన్ని తప్పులను క్షమిస్తారని ఊహించుకోవచ్చు. అవి ఏమిటంటే, ఒకటి, అవిశ్వాసిగా మరిణించడం మరియు రెండవది తెలిసి తెలిసి ఒక విశ్వాసిని హత్య చేయడం. (అంటే ఈ రెండు తప్పులకు క్షమాపణ లభించదు). అలా కాక హత్యకు శిక్షగా "హద్" దొరికినట్లైతే లేక స్వచ్ఛమైన మనస్సుతో క్షమాపణలు వేడుకుంటే కనుక అది వేరే విషయం.

"హద్" అంటే హత్యకు శిక్షగా ఖుర్ఆన్‌లో అల్లాహ్ పేర్కొన్న శిక్ష.

విధులు – 1

అంటే అల్లాహ్ మరియు ఆఖరి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ పై విశ్వసించిన ముస్లిమ్‌లందరూ తప్పక పాటించవలసిన కార్యాలు

హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు గారి నివేదిక ప్రకారం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా సెలవిచ్చారు, 'ఎప్పటి వరకైతే ఒకడు ఈ నాలుగు విషయాలపై విశ్వసిండో, అప్పటి వరకు అతడు మోమిన్ అనిపించుకోడు. 1) అల్లాహ్ తప్ప మరెవరూ ఆరధనకు అర్హుడు కాడన్న విషయం పై సాక్ష్యమివ్వడం 2) నేను అల్లాహ్ యొక్క ప్రవక్తను మరియు నేను వాస్తవలతో పంపబడ్డాను అన్న విషయానికి సాక్ష్యమివ్వడం 3) చావు, ఆ తరువాత తిరిగి జీవితం పొందడం పై విశ్వాసం కలిగి ఉండుట 4) తక్‌దీర్ పైన విశ్వాసం కలిగి ఉండుట' (తిర్మిజీ: 2145)

మన ఆఖరు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి

జ్ఞాపకాలు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

అందరికీ తెలుసు కానీ

హజ్రత్ ఆదమ్ అలైహిస్సలామ్ నుండి హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ వరకు అందరూ మానవాళికి సరియైన దారి చూపించడానికి, మానవాళిని అల్లాహ్ వైపు నడిపించడానికి, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఆఖరి ప్రవక్తగా వస్తారు అని వారి వారి ప్రజలతో ముందే చెప్పి ఉన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కాలం దగ్గరపడే కొద్దీ వారి గురించి ఎక్కువగా చెప్పుకోసాగారు. 'మీ జీవితకాలములో వారు కనుక పుట్టి పెరిగి ప్రవక్తనని ప్రకటిస్తే, ఆయనను మరియు వారి బోధనలను ఆచరించండి' అని తమ తమ ప్రజలకు తమ తమ పవిత్ర గ్రంధాలలో ఉన్న ఈ విషయాన్ని నొక్కి వక్కాణించి ఉపదేశించారు.

చివరి సమయంలో, పవిత్ర గ్రంధాలను పాటించేవారు, అంటే ఇన్‌జీల్, తౌరాత్, జబూర్ మరియు వేదాలు) పాటించేవారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కోసం ఆత్రుతగా ఎదురు చూసేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు రాబోయే విషయాన్ని తమ పుస్తకాలలో నుంచి చదివి వివరించేవారే, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తాను అల్లాహ్ యొక్క ప్రవక్తనని ప్రకటించిన తరువాత ఇస్లాం స్వీకరించడానికి సిగ్గు పడ్డారు మరియు కొంత మందయితే ఆయనను చూసి ఆసూయ పడసాగారు.

అల్లాహ్ వీరి గురించి ఇలా అన్నారు: 'అంటే, వీరి ముందు విగ్రహారాధులకు వ్యతిరేకంగా అల్లాహ్‌ను ప్రార్థించేవారు (వారికి లభించిన దైవ గ్రంధం ప్రకారం). వారు కోరుకున్నట్లుగా, అల్లాహ్, ఆఖరి ప్రవక్తను మరియు చివరి దైవ గ్రంధాన్ని పంపించినప్పుడు, వారు, దానిని సమ్మతించలేదు(తమ వంశంలే పుట్టలేదన్న ఒకే ఒక్క కారణంతో). ఇటువంటి ద్రోహులపై, అల్లాహ్ శపించు గాక.

(అల్ బకరహ్: 89)

అలాగే మక్కా నగరంలో 'కాహిన్' (మంత్రగాళ్ళు) అనే వారు ఉండేవారు. వీళ్ళు 'జిన్' అనే జీవులను ఉపయోగించి జరగబోయే సంఘటనలను కొంత వరకు వాస్తవంగా చెప్పేవారు.

కాహిన్‌లకు జిన్‌లతో సంబంధం ఉంటుంది. ఆ రోజుల్లో జిన్‌లు ఆకాశం వరకు వెళ్ళి దైవ దూతల సంభాషణలు విని కాహిన్‌లకు వచ్చి చెప్పేవారు. కాహిన్‌లు తమ అనుభవంతో కొంచొం జోడించి చెప్పేవారు. అప్పుడప్పుడు అవి నిజమయ్యేవి. ఎప్పుడైతే అల్లాహ్ ఖుర్‌ఆన్ అవతరింపచేయాలని అనుకున్నారో, దాని సంరక్షణ కోసం(జిన్‌లు రాకుండా) నక్షత్రాలను కాపలాగా ఉంచారు. ఇప్పుడు అవి ఎటువంటి సంగతులను తీసుకు రాలేరు.

మదీనాలో 'అబ్దుల్ అష్‌అల్' అనే తెగలో ఒక యూదుడు ఉండేవాడు. ఆయన ఒక రోజు బయటకు వచ్చి ఒక ప్రదేశంలో కూర్చుని యుగాంతం, చనిపోయిన తరువాత జరగే విషయాలు, స్వర్గం, నరకం మొదలైన వాటి గురించి చెప్పసాగారు. ఆ సమయములో ఆయన ఎదురుగా విగ్రహారాధకులు కూర్చుని వింటున్నారు.

"నువ్వు ఇవన్నీ నిజముగా జరుగుతాయని నమ్ముతావా? చనిపోయిన తరువాత రెండో సారి మనము నిజముగానే బ్రతికించబడుతామా?" అని వారందరూ అడిగారు.

"అవును" అని ఆయన జవాబిచ్చారు.

"నువ్వు చెప్పేదానికి సాక్ష్యం ఏమిటి" అని వారందరూ అడిగారు.

"ఎవరైతే ఈ ప్రదేశానికి ప్రవక్తగా రానున్నారో, వారే సాక్ష్యం", అని సెలవిచ్చారు.

వాళ్ళందరూ, "ఎప్పుడు వస్తారు" అని అడిగారు.

ఆయన, అప్పుడు అక్కడ కూర్చున్న వారిలో చిన్న పిల్లవాడి వైపు చూపిస్తూ, "ఈ పిల్లవాడు తన పూర్తి జీవిత కాలం కనుక బ్రతికితే ఆయనను చూడగలరు" అని అన్నాడు.

ఈ పిల్లవాడు మరియు అందరూ తర్వాతి కాలంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వచ్చిన తరువాత ఇస్లాం స్వీకరించారు. ఆ పిల్లవాడే హాజ్రత్ సలామా బిన్ సలామా రజియల్లాహు తఆలా అన్హుమ్. ఆఖరి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వచ్చినప్పుడు ఆ యూదుడు బ్రతికే ఉన్నాడు. అందరూ వెళ్ళి ఆయన ఇంతకు ముందు చెప్పిన మాటలను గుర్తుచేసారు.

దానికి, "అవును. నేను చెప్పిన మాట వాస్తవమే. కానీ ....." అని చెప్పి, మాటలను ప్రక్క దోవ పట్టించ సాగాడు.

అలాగే మదీనాలో 'బనూ ఖురైజా' అనే తెగలో ఒక యూదు జ్ఞాని ఉండే వాడు. అతడు షామ్ దేశం నుండి వలస వచ్చి మదీనాలో నివసించ సాగాడు. అతడు చాలా దైవ భక్తి కలవాడు మరియు పవిత్రమైన మనస్సు కలిగి ఉండేవాడు. మదీనాలోని ప్రజలు ఆయనతో ప్రార్థనలు చేయించేవారు. అతడి ప్రార్థనలు కూడా ఫలించేవి. చాలా సార్లు ఆయన చేసిన ప్రార్థనల వల్ల మదీనాలో వర్షాలు పడ్డాయి. ఆయన తన చివరి రోజుల్లో యూదులు అందరినీ పిలిపించారు.

"నేను పచ్చని పొలాలు ఉండే ప్రదేసమునైన షామ్ దేశాన్ని వదిలి ఈ బంజరు భూములు ఉన్న మదీనాకు ఎందుకు వచ్చానో తెలుసా?" అని అక్కడకు వచ్చిన వారందరినీ అడిగారు. దానికి వారు, 'తెలియదు. మీకే తెలియాలి' అని సమాధానమిచ్చారు.

'అసలు విషయం ఏమిటంటే, ఆఖరు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇక్కడికి వస్తారు. ఈ ప్రదేశం ఆయన వలస చేసి వచ్చే ప్రదేశము. నేను బ్రతికి ఉండగానే ఆయన రావాలని కోరుకుంటాను. ఆయన అవతరించే రోజులు చాలా దగ్గరగా ఉన్నాయి. వారు కనుక వతరిస్తే, నేను, అన్ని విషయాలలో అనుసరిస్తాను. గుర్తుంచుకోండి! ఆయన కనుక వస్తే మీరు ఆయనతో తలపడకండి. ఎందుకంటే, మీలో ఆయనకు ఎదురు నిలబడే శక్తి లేదు'. అని చెప్పారు.

ఎప్పుడైతే ఆఖరి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఒకానొక సమయంలో బనూ ఖురైజాతో యుద్ధం చేయవలసి వచ్చిందో, అప్పుడు కొంత మంది యువకులకు పెద్దాయన చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి తమ సహచరులను పోరాడవద్దని చెప్పారు. కానీ యూదులు వాళ్ళ మాటలను పెడ చెవిన పెట్టారు. ఆ కొద్ది మంది యువకులు మాత్రం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని విశ్వసించి ఇస్లాం స్వీకరించారు.

ఇలాగే మక్కా నగరంలో ఒక యూదుడు వ్యాపార నిమిత్తం ఉండేవాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు జన్మించిన రోజు ఖురైష్ వారితో, 'ఈ రోజు ఎవరైనా పిల్లవాడు మక్కాలో జన్మించాడా?' అని అడిగి తెలుసుకున్నాడు. వాళ్ళు, 'తెలియదు' అని చెప్పగా 'తెలుసుకుని చెప్పండి' అని అన్నాడు.

'ఎందుకంటే ఈ రాత్రికి యుగాంతం వరకు వచ్చే ప్రజల యొక్క ప్రవక్త పుట్టి ఉంటాడు' అని అన్నాడు. ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు పుట్టిన విషయం తెలుసుకుని, ఆయన పుట్టిన ఇంటికి వెళ్ళి, ప్రవక్త గారిని మరియు మొహరె నబువ్వత్‌ను చూసి(ప్రవక్త గారి వీపు మీద ఉన్న మచ్చను), 'ఇప్పుడు, ప్రవక్త తత్వం బనీ ఇస్రాయీల్ వంశం నుండి చేజారిపోయింది. ఈ పిల్లవాడు ప్రపంచం మొత్తాన్ని శాసిస్తాడు' అని అన్నాడు.

క్రీస్తు మతస్థుల గురించి చెప్పాలంటే, ఖుర్‌ఆన్‌లో హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ గారు చెప్పిన మాటలు పొందు పరచి ఉన్నాయి. 'నేను మీ దగ్గరకు అల్లాహ్ తరపు నుండి పంపబడ్డాను. నా కంటే ముందు అల్లాహ్ పంపిన దైవ గ్రంధమైన తౌరాత్‌ను నిజమైనదిగా అభివర్ణించే వాని గురించి మరియు ఒక విశేష లక్షణాలు ఉన్న ప్రవక్త, ఎవరైతే నా తరువాత వస్తారో, ఆయన గురించి చెప్పడానికి వచ్చాను. ఆయన 'ఎహ్మద్' అని పిలవబడతారు' అని హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ గారు తన ఉమ్మత్‌ను ఉద్దేశించి అన్నారు.

చెప్పుకుంటూ పోతే 'అద్దాస్', వర్కా బిన్ నౌఫిల్, బుహైరా, నస్తూరా మొదలైన వారందరూ క్రీస్తు మతానికి చెందిన జ్ఞానులే. వీరందరు కూడా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని చూసి, ఆయనే ఆఖరు ప్రవక్త అని ధృవీకరించారు.

ఇంకా, రోమ్ దేశ చక్రవర్తి హర్‌కల్ (హెర్‌క్యులెస్) వద్దకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఇస్లాం ఆహ్వాన పత్రిక చేరగా, 'నాకు ఈయన వస్తారని ముందే తెలుసు. కానీ, ఆయన అరబ్‌లో, అరబ్‌ల వంశంలో పుడతారని తెలియదు. నేను ఆయన వద్దకు వెళ్ళగలిగితే ఆయన కాళ్ళు కడుగుతాను' అని చెప్పుకొచ్చారు గానీ ఇస్లాం మాత్రము స్వీకరించలేదు.

అలాగే, మొదటి సారి హజ్రత్ హలీమా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని మక్కా తీసుకు వచ్చే సమయంలో దారిలో కొంత మంది క్రైస్తవులు కలిసారు. వీళ్ళు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని చూసి, ముద్దు పెట్టుకుని, 'మాకు ఇతడు గిరించి బాగా తెలుసు. ఇతగాడో మహోన్నత వ్యక్తి అవుతాడు' అని అన్నారు.

ఎవరి గురించైనా చెప్పాలంటే, ఇంక మిగిలింది మక్కాలోని కాహిన్ (మాయగాళ్ళు), నుజూమీ (నక్షత్రాలను చూసి సోది చెప్పేవారు). ఇస్లాం ప్రకారం, వీరు చెప్పే విషయాలకు ఎంటువంటి దైవ సంబంధం లేదు. కానీ, వీరు ప్రవక్త గారి గురించి చెప్పిన సోది విషయాలు కూడా చరిత్రలో లిఖించబడ్డాయి. అలాగే, జిన్‌లు చెప్పిన విషయాలు కూడా చరిత్రలో పుస్తకాలలో లిఖించబడ్డాయి.

అసలు తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే, ఆ రోజుల్లో ఎవరి మాటలను నమ్మేవారో వాళ్ళందరూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పవిత్రమైన రాకను ముందే తెలియ చేసారు. వాటిని తెలుసుకుని అమలు చేసేవారి కోసం ఒక్క మాటైనా సరిపోతుంది. కానీ, వినకూడదు ఆచరించకూడదు అని అనుకున్న వారికి వేల పుస్తకాలు రాసినా ఏమీ లాభం ఉండదు.

జహబీ (రెహ్) గారి కథలు – 2

నమాజు చదవడానికి బద్ధకించడం – సమాధి శిక్ష

మన పూర్వీకులలోని పుణ్యాత్ముల ఈ విధంగా చెప్పి ఉన్నారు. ఒకతను తన చెల్లెలి మృతదేహాన్ని ఖననం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. అలా చేస్తుండగా అతడి జేబులోని పర్సు తన చెల్లెలి సమాధిలో పడిపోయింది. ఆ సమయంలోని హడావిడి వల్ల అతడు ఆ విషయాన్ని గమనించలేదు. చాలా సేపటి తరువాత ఆ విషయాన్ని గమనించాడు.

ఆ పర్సులో ఎక్కువ మొత్తం ఉండడం వలన, అతడు అందరూ వెళ్ళిపోయిన తరువాత శ్మసానానికి వెళ్ళి, తన చెల్లెలి సమాధిని ఒక వైపు నుండి తవ్వసాగాడు. అలా తవ్వగా, అతడి చెల్లెలి దేహాన్ని అగ్ని కాలుస్తూ ఉండడాన్ని చూస్తాడు. ఒక రకమైన భయంతో, వెంటనే మట్టితో సమాధిని కప్పేసి, ఏడుస్తూ ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చి, తన తల్లిని ఇలా అడుగుతాడు.

'అమ్మా! నా చెల్లెలు జీవితాన్ని ఎలా గడిపేది? రోజూ ఏమి చేసేది?' అని ఏడుస్తూ కంగారుగా అడుగుతాడు. అది విన్న అతడి అమ్మ, 'ఏమైంది? ఉన్నట్టుండి ఎందుకు అడుగుతున్నావు?' అని ప్రశ్నించింది. దానికి జవాబిస్తూ జరిగినదంతా చెబుతాడు.

